
అవినీతిపై అక్షర సమరం
మన అంకుశం
సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 234 | శుక్రవారం 16 మే 2025 | పేజీలు : 4 | వెల : 3/-



# విజయవాడలో తిరంగా ర్యాలీ



## హాజరైన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్
## నగరంలో వేలాది మందితో భారీ ర్యాలీ
## జాతీయ సమైక్యత, సమగ్రత చాటేలా విద్యార్థులు గీతాలాపన
## ఉగ్రవాదంపై పోరాడుతున్న సైనిక దళాలకు సెల్యూట్: చంద్రబాబు
## దాడులు చేస్తే చూస్తూ ఊరుకోం: పవన్ కల్యాణ్



**విజయవాడ**

నగరంలో వేలాది మందితో భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి బెంజిసర్కిల్ వరకు ర్యాలీ సాగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భాజపా ఏపీ అధ్యక్షురాలు పురందేశ్వరి, రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు, ఎంపీలు, ఎమ్మెల్యే, భాజపా, తెదేపా, జనసేన నాయకులు, నగరవాసులు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. జాతీయ సమైక్యత, సమగ్రత చాటేలా విద్యార్థులు గీతాలాపన చేశారు.

**ఉగ్రవాదంపై పోరాడుతున్న సైనిక దళాలకు సెల్యూట్: చంద్రబాబు**

జాతీయ జెండా చూడగానే దేశభక్తి, ఉద్వేగం ఉప్పొంగుతాయని సీఎం చంద్రబాబు అన్నారు. "మహిళల సిందూరం తుడిస్తే ఏం జరుగుతుందో ఆపరేషన్ సిందూర్ చెప్పింది. ఉగ్రవాదులు ఈ దేశంపైకి కన్నెత్తి చూడకుండా జవాబిచ్చాం. దేశ ప్రజలంతా సైనిక దళాల పరాక్రమం చూశారు. వారి భూ భాగంలోకి వెళ్లి ఉగ్రతండాలను ధ్వంసం చేశాం. దేశ రక్షణలో - మిగతా2లో

# అనంత సంజీవరెడ్డి స్టేడియంలో క్రీడలకు ఇబ్బంది లేకుండా చూడండి



## మంత్రి లోకేష్ దృష్టికి పీటీసీ గ్రౌండ్ సమస్య
## శాప్ ఛైర్మన్ రవినాయుడు విజ్ఞప్తి
## తక్షణ పరిష్కారానికి లోకేష్ ఆదేశాలు

**అంకుశం స్పోర్ట్స్ ప్రతినిధి అనంతపురం మే 16**

అనంతపురంలోని పీటీసీ గ్రౌండులోకి క్రీడాకారులను, వాకర్స్‌ను లోపలికి అనుమతించకుండా అధికారులు ఇబ్బంది పెడుతున్న విషయాన్ని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ అనిమిని రవినాయుడు విద్యాశాఖామంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. గత ఐదు దశాబ్ధాలుగా పీటీసీ గ్రౌండును వినియోగించుకుంటున్నామని, కానీ ఇటీవల కాలంలో మమ్మల్ని లోపలికి అనుమతించడం లేదని పలువురు క్రీడాకారులు, వాకర్స్ కలిసి శాప్ ఛైర్మన్‌కు విన్నవించారు. ఈ నేపథ్యంలో - మిగతా2లో

# విశాఖలో నిర్వహించే యోగా డే రికార్డు సృష్టించాలి

- జూన్ 21న యోగా డే కార్యక్రమానికి ప్రధాని మోదీ రాక
- ఆర్.కె. బీచ్ వద్ద లక్షల మందితో యోగాసనాలు
- అధికారుల సమీక్షలో సీఎం చంద్రబాబు



**అమరావతి**

విశాఖపట్నంలో జూన్ 21న నిర్వహించనున్న అంతర్జాతీ య యోగా డే కార్యక్రమం రికార్డు సృష్టించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. యోగా డే కార్యక్ర మంలో ప్రధాని నరేంద్ర మోదీ హాజరవుతున్న దృష్ట్యా చరిత్ర లో నిలిచిపోయేలా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యాచరణపై క్యాంప్ ఆఫీస్‌లో శుక్రవారం సీఎం చంద్రబాబు అధికారులతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "'యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్' ను ఈ ఏడాది యోగా దినోత్సవ థీమ్‌గా తీసుకున్నారు. 'జూన్ 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతిష్టాత్మకం గా తీసుకోవాలి. ప్రధాని వస్తున్న ఈ కార్యక్రమాన్ని అద్భుతం గా నిర్వహించడంతో పాటు..రాష్ట్రంలో యోగా అభ్యాసానికి ఇది నాంది పలకాలి. రాష్ట్రంలో ప్రతి ఒక్కరినీ ఈ కార్యక్రమం లో భాగస్వాములను చేయాలి. కనీసం రెండు కోట్లమందికి ఈ కార్యక్రమం చేరాలి. 'యోగాంధ్ర-2025' - మిగతా3లో

# ఈనెల 20న కేంద్ర కార్మిక సంఘాల దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ పిలుపు

**అంకుశం ప్రతినిధి విజయవాడ మార్చి 16**

కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20వ తేదీన కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో ప్రత్యక్షంగా పాల్గొని మద్దతు తెలపాలని సిపిఐ శ్రేణులకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు కె రామకృష్ణ నేడు ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను వేగవంతం చేసింది. పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులు హరించబడుతున్నాయి. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుకు కట్టబెడుతూ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నది. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వ పాలనలో ఆకలి, దారిద్ర్యం, నిరుద్యోగం, నిత్యవసర వస్తువుల ధరలు, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఉపాధి అవకాశాలు మృగ్యమయ్యాయి. మోడీ సర్కార్ కార్పొరేట్ శక్తుల అడుగులకు మడుగులొత్తుతోంది. దేశంలో అసమానతలు నానాటికి పెరిగిపోతున్నాయి. కేంద్ర ప్రభుత్వం కార్మికవర్గ హక్కులను హరించి కార్పొరేట్ పారిశ్రామిక శక్తుల దోపిడీకి సహకరించే రీతిలో 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో 4 లేబర్ కోడ్లను అమలులోకి తేవాలని గట్టిగా ప్రయత్నం చేస్తున్నది. కార్మికులను పెట్టుబడుదారులకు ఊడిగం చేసే యంత్రాలుగా మార్చేందుకే ఈ లేబర్ - మిగతా2లో



# కుట్రతోనే లిక్కర్ స్కామ్ అంటూ అక్రమ కేసు

**కాకినాడ:** తమ ప్రభుత్వ హయాంలో పూర్తి పారదర్శకంగా అమలు చేసిన మద్యం విధానంపై, ఇప్పుడు టీడీపీ కూటమి ప్రభుత్వం కుట్రలు, కుతంత్రాలు చేస్తూ,వైఎస్సార్‌సీపీని ఇబ్బంది పెట్టే లక్ష్యంతో పని చేస్తోందని శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. తమ ప్రభుత్వ హయాంలో మద్యం అమ్మకాల్లో నిజంగా తప్పు జరిగి ఉంటే, నిష్పాక్షికంగా జరిపే ఎలాంటి విచారణనైనా స్వాగతిస్తామని ఆయన వెల్లడించారు. కానీ రాజకీయ దురుద్దేశాలతో తప్పుడు విచారణల పేరుతో వేధింపులకు పాల్పడితే సహించేది లేదని, ప్రభుత్వ తీరును ప్రజల్లో ఎండ గడతామని కాకినాడలో మీడియాతో మాట్లాడిన బొత్స సత్యనారాయణ తేల్చి చెప్పారు. బొత్స ఇంకా ఏం మాట్లాడారంటే..

**కూటమి ప్రభుత్వం దారుణ వ్యవహారం**

కూటమి ఏడాది పాలనలో పార్టీల హనీమూన్ ముగిసింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం పూర్తిగా తుంగలో తొక్కింది. కూటమి పాలనలో అవినీతి, దోపిడీ తప్ప ప్రజా సంక్షేమం, అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదు. రాజకీయ కక్ష సాధింపులకే మొత్తం సమయాన్ని వెచ్చిస్తున్నారు. ఎన్నికల మందు ఆర్భాటంగా ప్రచారం చేసిన సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చకుండా తప్పించుకుంటున్నారు. మహిళలకు ఉచిత బస్సు, రైతులకు పెట్టుబడి సాయం, ప్రతి కుటుంబానికి ఏటా మూడు ఉచిత సిలిండర్లు, ఏటా 4 లక్షల ఉద్యోగాలు లేదా ప్రతి నెలా ఒక్కో నిరుద్యోగికి రూ.3 వేల భృతి, ఆడబిడ్డ నిధి కింది ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామన్నారు. కానీ, ఏడాది గడుస్తున్నా వాటిలో ఏదీ అమలు చేయడం లేదు. మరోవైపు ఎక్కడికక్కడ విచ్చలవిడిగా అంతులేని అవినీతి. దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా కేవలం 99 పైసలకే దాదాపు 3 వేల కోట్ల విలువైన భూముల అప్పగింత. ఇంకా కాకినాడలో బియ్యం అక్రమ రవాణా చేస్తున్నారంటూ.. 'సీజ్ ది షిప్' అని డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ నానా హంగామా చేశారు. ఒక్క బియ్యం గింజ కూడా అక్రమంగా రవాణా చేయడానికి వీలులేదని అన్నారు. కానీ ఒక్క దానిపైనా చర్యలు లేవు. పోలీసుల జులుంతో ప్రభుత్వాన్ని నడిపించాలని చూస్తున్నారు. అందుకే ప్రశ్నించే గొంతులను నొక్కేయాలని ప్రయత్నిస్తున్నారు.

**తెచ్చిన అప్పులు దేనికి ఖర్చు చేశారు?**

ఏడాది పాలనలోనే ఏకంగా రూ.1.59 లక్షల కోట్లు అప్పులు చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇంతలా ఏడాదిలో అప్పులు చేయలేదు. ఇంత అప్పులు తెచ్చి ఏ ప్రజా సంక్షేమ కార్యక్రమానికి ఖర్చు చేశారు? మా హయాంలో అప్పులు చేసినా, వివిధ పథకాల కింద రూ.2.73 లక్షల కోట్లు ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) రూపంలో లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశాం. మరి కూటమి ప్రభుత్వం చేసిన అప్పులు దేనికి వినియోగించారో చెప్పాలి. సంపద సృష్టిస్తాను. అది తనకు బాగా తెలుసు అని ప్రచారం చేసిన చంద్రబాబు, మరి ఇన్ని అప్పులు, ఇంత తక్కువ సమయంలో ఎందుకు చేశారు? అప్పు చేయడం. ప్రచార ఆర్భాటాలకు ఖర్చు చేయడం చంద్రబాబుకు బాగా అలవాటు. అదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కొంత అప్పు చేసినా, ఆ ఖర్చులకు ఒక అర్థం ఉంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, తీర ప్రాంతాల్లో పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, బోగాపురం ఎయిర్‌పోర్ట్.. ఇలా ఉత్పాదకతకు దోహదం చేసే వాటికి ఖర్చు చేశాం. మాట ఇస్తే, దాన్ని తప్పకుండా నెరవేర్చాలనేది జగన్‌గారి విధానం. అందుకే ఎన్నికల ముందు, టీడీపీ కూటమి మాదిరిగా, అడ్డగోలు హామీలు ఇవ్వలేదు.

**పార్టీ కార్యాచరణ. నిర్ణయాలు**

వైఎస్సార్‌సీపీ అయిదు జిల్లాల ముఖ్య నేతలతో శుక్రవారం సమావేశం నిర్వహించాం. భవిష్యత్తులో అన్ని జిల్లాల్లో సంస్థాగతంగా క్షేత్రస్థాయి నుంచి పార్టీ కమిటీల ఏర్పాటు, ప్రతి జిల్లాలో పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహణపై నిర్ణయం తీసుకున్నాం. అలాగే గోదావరి జిల్లాల్లో ధాన్యం సేకరణపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రశ్నించడంతో పాటు, తీర ప్రాంతాల్లోని ఆక్వా రైతుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని నిర్ణయించడం జరిగింది. పశ్చిమ గోదావరి జిల్లా మెట్ట ప్రాంతంలో పొగాకు రైతులు మద్దతు ధర లేక ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోనూ పొగాకు రైతులు ఇదే సమస్యలపై ఇబ్బంది పడుతున్నారు. దీనిపై పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్, పొగాకు రైతులను కలిసి నేరుగా వారితో మాట్లాడనున్నారు. తదుపరి పొగాకు కొనుగోళ్ళపై ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు పార్టీ పరంగా కార్యాచరణను ఖరారు చేయడం జరుగుతుంది. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో పొగాకు మద్దతు ధర లభించని సందర్భంగా మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకున్నాం. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం దీనికి భిన్నంగా రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఆ మొద్దునిద్ర నుంచి ప్రభుత్వాన్ని మేల్కొలిపేందుకు రైతుల పక్షాన పోరాడతామని బొత్స సత్యనారాయణ హెచ్చరించారు.

# ఇప్పటి నుంచే పక్కా ప్లాన్..

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు క్షేత్రస్థాయిలో పరిస్థితి అవగతమయినట్లుంది. కిందిస్థాయిలో క్యాడర్ కూడా ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని, జనంలోకి వెళ్లడానికి జంకుతున్నారన్న అభిప్రాయానికి వచ్చి ఆయన కీలక నిర్ణయం తీసుకున్నట్లు కనపడుతుంది. ఏడాది పాలన పూర్తయిన నాటి నుంచి ఇక జోరుగా హామీల అమలుకు కార్యాచరణను సిద్ధం చేయనున్నారు. ఈ మేరకు నిన్న జరిగిన పొలిట్ బ్యూరో సమావేశంలో తన మనసులో మాట చెప్పకనే చెప్పారు. ఎన్నికలు ఎప్పుడైనా రావచ్చు. జమిలి ఎన్నికలకు కేంద్ర ప్రభుత్వం వెళ్లినా ఈసారి కూడా పెద్ద సంఖ్యలో స్థానాలను కూటమి సాధించాలంటే ఇచ్చిన హామీలను అమలు చేయాలని చంద్రబాబు నిర్ణయించారు.ఈ ఏడాది జూన్ పన్నెండో తేదీ నాటికి చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలను చేపట్టి ఏడాది పూర్తవుతుంది. ఆరోజున లక్షమందికిపైగా వితంతు, ఒంటరి మహిళలకు కొత్తగా పింఛన్లు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. అలాగే సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి తేదీలతో త్వరలో క్యాలెండర్ ను విడుదల చేయనున్నారు. ఏడాది పొడవునా ఏ ఏ హామీలు ఏ తేదీన అమలు చేయనున్నామో స్పష్టంగా ప్రజల ముందు ఉంచి వారికి ఖచ్చితమైన సమాచారం అందచేయాలన్న ఉద్దేశ్యంతో చంద్రబాబు ఉన్నారు. ఆరు నూరైనా ఆరోజు ఆ హామీని అమలు చేసేలా అధికారులకు కూడా ఆదేశాలు జారీ చేయనున్నారు. అందుకు అవసరమైన నిధులను కూడా రెడీ చేసుకునేందుకు అధికారులకు కొంత సమయం ఇవ్వాలని నిర్ణయించారు.మరో రెండు నెలల్లో మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రవేశ పెట్టాలని నిర్ణయించారు. అయితే ఏ నెల




నుంచి అమలు చేస్తారరన్నదానిపై ఇంకా స్పష్టత లేకున్నా త్వరలో మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని జిల్లా స్థాయిలో ప్రవేశపెట్టాలని రెడీ అయిపోయినట్లే కనిపిస్తుంది. దీపం పథకం ఇచ్చే మూడు సిలిండర్లకు సంబంధించి ముందుగానే నగదును లబ్దిదారుల ఖాతాలోనే విడుదల చేయాలని నిర్ణయించారు. సిలిండర్ బుక్ చేసుకున్నారా? లేదా? అన్నది సంబంధం లేకుండా ముందుగానే డబ్బులు వారి ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించారు. చాలా మందికి డబ్బులు పడటం లేదన్న ఫిర్యాదులు వస్తుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల మహిళల ఓటు బ్యాంకు చెక్కు చెదరకుండా ఉండేలా ఇటు ఉచిత బస్సు పథకం, అటు దీపం పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని నిర్ణయించారు. మొత్తం మీద చంద్రబాబు నాయుడు ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పార్టీ శ్రేణులను సిద్ధం చేయడంతో పాటు ఓటు బ్యాంకు కూడా పటిష్టపర్చేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. పాక్ – భారత్ ఉద్రిక్తతల నేపథ్యంలో జరిగిన ఆపరేషన్ సిందూర్ సక్సెస్ కావడంతో మోదీ ప్రభుత్వం ఎప్పుడైనా ఎన్నికలకు వెళ్లే అవకాశముందని కూడా చంద్రబాబు అనుమానిస్తున్నారు. జమిలి ఎన్నికలు 2027 లేదా 2028 లో వచ్చినా ప్రజల్లో అసంతృప్తి లేకుండా అన్ని రకాలుగా గ్రౌండ్ ను చంద్రబాబు ప్రిపేర్ చేస్తున్నారు. ఈ సారి కూటమితోనే ఎన్నికలకు వెళ్లాల్సి ఉంటుంది. అందుకు తగినట్లుగా ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటునట్లే కనపడుతుంది. ఇలా చంద్రబాబు జగన్ పాదయాత్ర చేసినా తన పథకాలతో జనాన్ని తన వైపునకు తిప్పుకునేందుకు అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకోవాలని చంద్రబాబు నిర్ణయించి ఈ మేరకు ముందుకు వెళుతున్నారు.

## మద్యం కుంభకోణం కేసులో ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి అరెస్ట్

**విజయవాడ:** వైకాపా హయాం నాటి మద్యం కుంభకోణం కేసులో ఒకేసారి రెండు పెద్ద వికెట్లు పడ్డాయి. సుదీర్ఘ విచారణ తర్వాత నాటి సీఎం కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డి, జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డిని సిట్ అధికారులు అరెస్టు చేశారు. 3 రోజుల పాటు ప్రశ్నించిన సిట్ బృందం మద్యం కేసులో వీరి పాత్రపై స్పష్టత తీసుకున్న తర్వాత ఇద్దరినీ అరెస్టు చేసినట్టు గురువారం సాయంత్రం ప్రకటించింది. ఇవాళ ఉదయం నుంచి 9గంటల పాటు ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిని సిట్ విచారించింది. వీరిద్దరూ ఏ31, ఏ32 నిందితు లుగా ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి మే 16 వరకు తదుపరి చర్యలు చేపట్టవద్దని ఇటీవల సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, విచారణకు హాజరుకావాలని పేర్కొంది. ఈ నేపథ్యంలో ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిని విజయవాడలోని సిట్ కార్యాలయంలో అధికారులు 3 రోజులుగా విచారించారు. వైకాపా హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణంలో.. నాటి సీఎంవో కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డి, జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, భారతి సిమెంట్స్ పూర్తికాలపు డైరెక్టర్ గోవిందప్ప బాలాజీలను ఇటీవల సిట్ నిందితులుగా చేర్చింది. ఈ కేసులో ఏ 33 నిందితుడుగా ఉన్న గోవిందప్ప మంగళవారం అరెస్టయిన విషయం తెలిసిందే.

**సుప్రీం కోర్టులో చుక్కెదురు..**

ఏపీ మద్యం కుంభకోణం కేసులో సుప్రీంకోర్టు గురువారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డికి ముందస్తు బెయిల్ నిరాకరించింది. ఈ ఇద్దరు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టేసింది. పిటిషనర్లకు వ్యతిరేకంగా అన్ని సాక్ష్యాలు ఉన్నాయని తెలిపింది. దర్యాప్తు కీలక దశలో ఉన్నందున ముందస్తు బెయిల్ ఇవ్వలేమని పేర్కొంది. వీరికి గతంలో ఏపీ హైకోర్టు ముందస్తు బెయిల్ నిరాకరించింది. ఈ తీర్పును ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. దీనిపై జస్టిస్ పార్థీవాలా ధర్మాసనం విచారణ జరిపింది. ముందస్తు బెయిల్ ఇస్తే విచారణాధికారి చేతులు కట్టేసినట్లు అవుతుందని పేర్కొంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఇవ్వడం కుదరదని తేల్చి చెప్పింది. రెగ్యులర్ బెయిల్‌కు అప్లై చేస్తే నిబంధనలు, మెరిట్స్ ప్రకారం హైకోర్టు, ట్రయల్ కోర్టులు నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది.

## ట్రైలర్ మాత్రమే చూశారు.. పాక్ తీరు మారకపోతే పూర్తి సినిమా చూపిస్తాం

**గాంధీనగర్:** ఆపరేషన్ సిందూర్ ముగియలేదు. ట్రైలర్ మాత్రమే చూశారు. పాక్ తీరు మార్చుకోకపోతే సినిమా చూపిస్తాం' అంటూ కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరికలు జారీ చేశారు. శుక్రవారం గుజరాత్‌లోని భుజ్ ఎయిర్ బేస్‌లో ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న ఎయిర్ వారియర్స్‌తో రాజ్‌నాథ్ భేటీ అయ్యారు. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న ఎయిర్ వారియర్స్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. అనంతరం, ఆయన మీడియా మాట్లాడారు. పాకిస్తాన్‌పై భారత్ విజయానికి ఎయిర్‌బేస్ సాక్ష్యం.పహల్గాం దాడి, ఆ తర్వాత ఆపరేషన్ సిందూర్‌ను ప్రపంచమంతా చూసింది. పాకిస్తాన్‌లో ఉగ్రశిబిరాలను ధ్వంసం చేశాం. బ్రహ్మోస్ మిస్సైల్ పవరేంటో పాకిస్తాన్‌కు చూపించాం. బోర్డర్ దాటకుండానే పాక్ ఉగ్ర శిబిరాలను నాశనం చేశాం. పాకిస్తాన్ ముఖ్య ఉగ్ర కేంద్రాన్ని ధ్వంసం చేశాం. నయా భారత్ ఎంటో ప్రపంచానికి తెలిసింది. మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది మసూద్ అజహార్‌కు పాక్ రూ.14కోట్లు ఇచ్చింది. ప్రపంచానికి మన సత్తా ఏంటో కళ్లకు కట్టేలా చూపించాం. మన వాయిసేన అసమాన ప్రతిభ కనబర్చి ప్రత్యర్థులను వణికించింది. ఉగ్రవాదులకు పాకిస్తాన్ ఫండింగ్ చేస్తోంది. ఇది ఒక ట్రైలర్ మాత్రమే.. పాక్‌కు అసలు సినిమా ముందుంది' అంటూ రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు.

## భారత్ వ్యూహాత్మక సత్తాను ఆపరేషన్ సిందూర్ చాటింది

న్యూఢిల్లీ: జాతీయ భద్రత, ఇంటెలిజెన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పటిష్టతకు భారత ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అన్నారు. న్యూఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లో కొత్త మల్టీ-ఏజెన్సీ సెంటర్‌ను శుక్రవారం నాడు అమిత్ షా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యూహాత్మక్మ వృద్ధి, నిర్వహణ సామర్థ్యాలకు 'ఆపరేషన్ సిందూర్' ఒక ఉదాహరణనని చెప్పారు. ఈ ఆపరేషన్ విజయవంతానికి ప్రధానమంత్రి మోదీ దృఢ సంకల్పం, కచ్చితమైన, సకాలంలో అందిన ఇంటెలిజెన్స్ సమాచారం, భారత సాయుధ బలగాల సత్తా కారణాలని ప్రశంసించారు. ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) ఆధ్వర్యంలో కొత్తగా ప్రారంభించిన మల్టీ ఏజెన్సీ సెంటర్ (ఎంఏసీ) పనిచేస్తుంది. దేశవ్యాపంగా ఉన్న వివిధ భద్రతా సంస్థలు, నిఘా ఏజెన్సీల మధ్య సమాచార మార్పిడి, సమన్వయానికి ఎంఏసీ కృషి చేస్తుంది. అంతర్గత, బహిర్గత ముప్పును అంచనా వేసి, ఆ ముప్పును నివారించేందుకు అవసరమైన రియల్ టైమ్ ఇంటెలిజెన్స్ షేరింగ్, సత్వర స్పందన మెకానిజం, ఇంటర్-ఏజెన్సీ సినర్జీ మెరుగుపరిచేందుకు ఈ వ్యవస్థ ఎంతో ఉపకరిస్తుందని అంచనా వేస్తున్నారు.

**'ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్'లో గాయపడిన వారి పరామర్శ..**

దీనికి ముందు, ఇటీవల ముగిసిన నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్.. 'ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్'లో గాయపడిన ఐదుగురు భద్రతా సిబ్బందిని అమిత్‌షా పరామర్శించారు. వారికి అందుతున్న చికిత్స, క్షేమ సమాచారాన్ని ఆయన అడిగి తెలుసుకున్నారు. న్యూఢిల్లీలోని ఎయిమ్స్ ట్రౌమా సెంటర్‌లో వీరు చికిత్స పొందుతున్నారు. ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దుల్లోని కరెగుట్ట హిల్స్‌లో బలగాలు ఈ ఆపరేషన్ నిర్వహించాయి. మావోయిస్టులపై జరిగిన ఈ అతిపెద్ద ఆపరేషన్ 21 రోజులపాటు సాగింది. పలువురు వాంటెడ్ కమాండర్స్‌తో సహా 31 మంది టాప్ నక్సలైట్లను ఈ ఆపరేషన్‌లో బలగాలు మట్టుబెట్టాయి. ఈ ఆపరేషన్‌లో అసిస్టెంట్ కమాండంట్ సాగర్ బొరాడే (204 కోబ్రా బెటాలియన్), హెడ్ కానిస్టేబుల్ మునీశ్ చంద్ శర్మ (203 కోబ్రా), కానిస్టేబుల్ ధను రామ్ (204 కోబ్రా), కానిస్టేబుల్ కృష్ణ కుమార్ గుర్జర్ (196 సీఆర్‌పీఎఫ్), కానిస్టేబుల్ సంతోశ్ మురమి (డిస్ట్రిక్ రిజర్వ్ గార్డ్, ఛత్తీస్‌గఢ్ పోలీస్) ఉన్నారు.

## విజయవాడలో తిరంగా ర్యాలీ

-మొదటిపేజీ తరువాయి

పాతికేళ్ల కుర్రాడు మురళీ నాయక్ మనకు స్ఫూర్తి. ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా అంతం చేయాలని మోదీ సంకల్పం తీసుకున్నారు. భారత్‌పై దాడి చేస్తే అదే వారికి చివరి రోజు అవుతుంది. మీ కుట్రలు, కుతంత్రాలు భారత్‌ను ఏమీ చేయలేవు. దేశానికి సరైన సమయంలో సరైన నాయకుడు మోదీ ఉన్నారు" అని చంద్రబాబు అన్నారు.

**దాడులు చేస్తే చూస్తూ ఊరుకోం: పవన్ కల్యాణ్**

"భారత్‌లో జరిగిన ఉగ్రదాడులన్నింటిలో పాకిస్థాన్ హస్తం ఉంది. వారి దేశాన్ని పాలించుకోలేక.. అభివృద్ధి చెందుతున్న భారత్‌లో కల్లోలం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. దేశ విభజన జరిగినప్పటి నుంచి మనపై అనేక దాడులు జరిగాయి. దేశంలోని వివిధ నగరాల్లో పేలుళ్లకు పాల్పడింది. భారత్ అభివృద్ధిని చూసి పాకిస్థాన్ అసూయతో రగిలిపోతోంది. మన దేశం అభివృద్ధి చెందుతుంటే తట్టుకోలేక శత్రుదేశం అనేక దాడులు చేసింది. పోతే సైనికుడిగా పోవాలి అని మురళీ నాయక్ దేశం కోసం ప్రాణాలు అర్పించారు. దేశ భక్తి అంటే ఏంటో మురళీ నాయక్ చేసి చూపించారు. ఇలాంటి సమయంలో ప్రధాని మోదీకి అండగా ఉంటాం. దాడులు చేస్తే చూస్తూ ఊరుకోం. ఇది కొత్త భారతం అని పాకిస్థాన్ గ్రహించాలి. తిరంగా యాత్రలో పాల్గొన్న ప్రజలకు అభినందనలు" అని పవన్ కల్యాణ్ తెలిపారు.

## అనంత సంజీవరెడ్డి స్టేడియంలో క్రీడలకు ఇబ్బంది లేకుండా చూడండి



-మొదటిపేజీ తరువాయి

శుక్రవారం అనంతపురం పర్యటనకు విచ్చేసిన మంత్రి లోకేష్‌కు క్రీడాకారుల, వాకర్ల సమస్యను వివరించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని శాప్ ఛైర్మన్ విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి లోకేష్ సానుకూలంగా స్పందిస్తూ హోంమంత్రితో తక్షణమే మాట్లాడి సమస్యను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఆదేశాలు జారీ చేశారు. పీటీసీ గ్రౌండుకు వచ్చే క్రీడాకారులను, వాకర్లను, ప్రజలను ఇబ్బందుకు గురిచేయొద్దని, ఇబ్బందులకు గురిచేసే అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సమస్య పరిష్కారానికి కృషి చేసిన మంత్రికి శాప్ ఛైర్మన్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఈనెల 20న కేంద్ర కార్మిక సంఘాల దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి.

-మొదటిపేజీ తరువాయి

కోట్లు ఉపయోగ పడతాయని యావత్ కార్మిక వర్గం ఆందోళన చెందుతుంది. పని గంటలు, కనీస వేతనాలు, సామాజిక భద్రత వంటి అంశాలు ప్రశ్నార్థకం కానున్నాయి. సంఘాల నిర్మాణం, సంఘాల గుర్తింపు, సమిష్టి బేరసారాల హక్కుపోరాటం, ఉద్యమాల నిర్వహణ, సమ్మె హక్కు లాంటి వాటిని కార్మిక వర్గం కోల్పోతున్నది. బడ్జెట్లో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను తగ్గించేయడం, ప్రజారోగ్యం, విద్య, సంక్షేమ పథకాలకు కేటాయింపులను తగ్గించి వేసింది. రైతు, వృతిరేక దుష్ట చట్టాలను వక్రమార్గంలో తిరిగి తీసుకు వచ్చే ప్రయత్నాలను పాలకులు కొనసాగిస్తున్నది. సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదు. కనీస వేతనం ఇవ్వకపోగా 8 గంటల పని విధానానికి తిలోదకాలు ఇస్తున్నారు. నిర్మాణరంగ కార్మికుల సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేస్తున్నారు. రోజురోజుకు అసంఘటిత రంగం పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తున్నది. కేంద్ర ప్రభుత్వ తిరోగమన విధానాలపై కేంద్ర కార్మిక సంఘాలు, అసోసియేషన్లు, స్వతంత్ర ఫెడరేషన్ ల జాతీయ సదస్సు చర్చించి మే 20వ తేదీన దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది.ఈ నేపథ్యంలో జాతీయ సదస్సు పిలుపుమేరకు మే 20వ తేదీన జరగనున్న దేశవ్యాప్త సమ్మెకు సిపిఐ రాష్ట్ర సమితి మద్దతు ప్రకటిస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సిపిఐ శ్రేణులు ప్రత్యక్షంగా సమ్మెలో పాల్గొనాలని కోరుతున్నది. ఈ సమ్మెలో కార్మిక వర్గంతో పాటు యావన్మంది ప్రజానీకం పాల్గొని జయప్రదం చేయవలసిందిగా పిలుపునిస్తున్నాం.

## విశాఖలో నిర్వహించే యోగా డే రికార్డు సృష్టించాలి

-మొదటిపేజీ తరువాయి

థీమ్‌తో రాష్ట్రంలో ప్రచారం చేపట్టాలి. దీని కోసం ప్రజలను సన్నద్ధం చేసేందుకు ఈనెల 21 నుంచి జూన్ 21 వరకు యోగా మంత్ పాటించాలి. ఈ నెల రోజులు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో యోగా ప్రాక్టీస్ జరగాలి. దీని కోసం ప్రైవేటు వ్యక్తులు, శిక్షకులు, యోగా అసోసియేషన్లు, నిపుణులను భాగస్వాములను చేయాలి. నెలరోజుల పాటు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో ప్రజలకు యోగా పై శిక్షణ ఇవ్వాలి. నెల రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న వారిని గుర్తిస్తూ సర్టిఫికెట్ ఇవ్వాలి. రాష్ట్రంలో గ్రామ,వార్డు సచివాలయాల ద్వారా యోగా డేలో పాల్గొనే అంశంపై ప్రజల నుంచి రిజిస్ట్రేషన్లు తీసుకోవాలి. అదే విధంగా రాష్ట్రంలోని స్కూళ్లు, కాలేజీల విద్యార్థులను ఈ కార్యక్రమంలో భాగస్వాముల్ని చేయాలి. యోగా అనేది ప్రాథమిక బాధ్యత అనేలా ప్రతిఒక్కరూ భావించాలి. యోగా డే అనంతరం కూడా రాష్ట్రంలో యోగా సాధన ఒక వ్యాపకంగా మారాలి. రాష్ట్రంలో ప్రతి చోటా యోగాపై నెలరోజుల పాటు విస్తత చర్చ జరగాలి. మనం నిర్వహించే యోగా డే విస్తత ప్రాచుర్యం కల్పించడానికి ఈషా ఫౌండేషన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వంటి సంస్థల సహకారాన్ని తీసుకోవాలి. ఎపిలో జరిగే యోగా డే గత 10 ఏళ్ల కార్యక్రమాలను తిరగరాసేలా ఉండాలి" అని సిఎం చంద్రబాబు సూచించారు. ఆర్‌కె బీచ్‌లో ప్రధాని కార్యక్రమం, ప్రజల పాల్గొనే ప్రాంతాలు, నిర్వహణపై అధికారులు ప్రజెటేషన్ ఇచ్చారు. ఆర్కె బీచ్ నుంచి భీమిలి బీచ్ వరకు అన్ని చోట్లా ప్రజలు యోగాసనాలు వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్కె బీచ్ నుంచి భీమిలి బీచ్ రోడ్ వరకు సుమారు 2.5 లక్షల మంది యోగాలో పాల్గొనేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. యోగా నిర్వహించేందుకు 68 ప్రాంతాలు గుర్తించారు. ఆర్కె బీచ్, రుషికొండ, స్కూల్, క్రికెట్, పోలీస్, స్పోరట్స్, నావీ ప్రాంగణాలతో పాటు పలు ఖాళీ ప్రదేశాలను యోగా నిర్వహణకు గుర్తించారు. ఈ 68 లోకేషన్ల ద్వారా 2,58,948 మంది యోగా సాధనకు అవకాశం కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. యోగా దినోత్సవాన్ని ప్రకటించి 10 ఏళ్లు పూర్తియిన సందర్భంగా, ప్రధాని పాల్గొనే విశాఖ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించాలని సీఎం సూచించారు. ఇందులో భాగంగా 5 లక్షల మంది భాగస్వాములు అయ్యేలా ఆర్కె బీచ్ నుంచి శ్రీకాకుళం వరకు బీచ్ పొడవునా అన్ని అనుకూల ప్రాంతాల్లో ప్రజలను ఆహ్వానించి యోగా కార్యక్రమాన్ని నిర్వహించాలని సీఎం చంద్రబాబు సూచించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చొరవతో జూన్ 21వ తేదీని అంతర్జాతీయ యోగా డేగా ఐక్యరాజ్యసమితి గుర్తించింది. యోగా డే రోజుల ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు యోగా సాధన ఉంటుంది. 2015లో తొలిసారి అంతర్జాతీయ యోగా దినోత్సవం నాడు 36 వేల మందితో ఒకే వేదికపై నిర్వహించిన కార్యక్రమం గిన్నిస్ రికార్డుకు ఎక్కింది. తొలి ఏడాది 84 దేశాల్లో యోగాను నిర్వహించారు. ప్రపంచంలోని 170కి పైగా దేశాలు యోగా డే ను ప్రస్తుతం నిర్వహిస్తున్నాయి. 2023లో సూరత్‌లో 1,53,000 మందితో ఒకే చోట అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరిపి మరోసారి గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లకు ఎక్కింది. సూరత్ తరహా మోడల్‌లో విశాఖలోనూ యోగా దినోత్సవాన్ని నిర్వహించి ఈసారి ఆ రికార్డును తిరగరాయాలని సీఎం సూచించారు.ం

## పరిటాల ఇంటికి కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న, విమానయాన శాఖ మంత్రి రామమోహన్ నాయుడు





- రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించి సమస్య పరిష్కరించండి
- తిరుపతి రైలును రామగిరి మీదుగా వచ్చేలా చూడండి
- రైల్వేశాఖ మంత్రికి ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ విజ్ఞప్తులు
- విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన మంత్రి సోమన్న

**అంకుశం న్యూస్ అనంతపురం మే 16:** రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాలలోని రైల్వే సమస్యల్ని.. ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్నకు విజ్ఞప్తి చేశారు. పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు జిల్లాకు వచ్చిన రైల్వే మంత్రి సోమన్న ఎమ్మెల్యే పరిటాల సునీత ఇంటికి వెళ్లారు. అక్కడ ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్ధార్థ మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం పరిటాల నివాసంలో కాసేపు సమావేశం అయ్యారు. ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్ ను మంత్రి సోమన్న ఎంతో ఆప్యాయంగా పలుకరించారు. ఈ సందర్భంగా ధర్మవరం నియోజకవర్గంలో ఉన్న రైల్వే విభాగానికి సంబంధించిన అంశాలపై వినతి పత్రం అందజేశారు. ధర్మవరం నుంచి నాగసముద్రం మధ్య డబ్లింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో చైనేజ్ 171/600 వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ప్రాంతం చుట్టుపక్కల ఇందిరమ్మ కాలనీ, కేతిరెడ్డి కాలనీ, టిడ్కో గృహాలు, రేగాటిపల్లి గ్రామాల ప్రజలు, రైతులు, వ్యవసాయ కూలీలు రాకపోకలు సాగిస్తుంటారన్నారు. లెవల్ క్రాసింగ్ గేట్ ఏర్పాటు దాలకు గురవుతున్నారన్నారు. ఇటీవల కాలంలో కేతిరెడ్డి కాలనీ వద్ద రైలు పట్టాలపై కొన్ని దుర్ఘటనలు కూడా చోటు చేసుకున్నాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఇక్కడ లెవల్ క్రాసింగ్ గేట్ లేక ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందనా న్నరు. మరోవైపు ఎమ్మెల్యే పరిటాల సునీత కూడా రైల్వే మంత్రికి వినతి పత్రం అందజేశారు. కదిరిదేవరపల్లి రైలులో పావగడ, కళ్యాణదుర్గం నియోజకవర్గాల ప్రజలు తిరుపతికి వెళ్లాలంటే కంబదూరు, కళ్యాణదుర్గం, రాయదుర్గం, బళ్లారి, గుంతకల్లు, అనంతపురం మీదుగా ధర్మవరంకు 260 కిలోమీటర్లు దూరం చుట్టి రావాల్సి వస్తోందన్నారు. అలా కాకుండా కంబదూరు నుంచి పేరూరు, రామగిరి మీదుగా నాగసముద్రం గేట్ వరకు



కొత్త రైల్వే లైన్ వేస్తే సుమారు 2వందల కిలోమీటర్లు పైగా దూరం తగ్గడంతో పాటు ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. కావున కంబదూరు-నాగసముద్రం మార్గంలో కొత్త రైల్వే లైన్ మంజూరు చేయాలని ఎమ్మెల్యే సునీత విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్ విజ్ఞప్తులపై మంత్రి సోమన్న సానుకూలంగా స్పందించారు. వెంటనే రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి.. వీటిని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామమోహన్ నాయుడు, ఇతర ఎమ్మెల్యేలు పరిటాల నివాసానికి విచ్చేసి అథిత్యం స్వీకరించారు..

## ఆర్మీ జవాన్ మురళి నాయక్ కుటుంబానికి వైయస్ జగన్ ఆదేశాలతో 25 లక్షల రూపాయలు ఆర్థిక సాయం..

తల్లితండ్రులకు చెక్కును అందజేసిన మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్,

తన తోటి భారతీయుల రక్షణ కొరకు, భరతమాత సేవలో తన ప్రాణాలు ధారబోసి అమరుడైన వీర జవాన్ మురళి నాయక్,





**అంకుశం న్యూస్ పెనుగొండ మే 16:** శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లి తండాకు చెందిన అమరుడైన వీర జవాన్ మురళి నాయక్ కుటుంబానికి వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా నిలిచింది. మాజీ ముఖ్యమంత్రి, అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో 25 లక్షల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. శుక్రవారం మురళి నాయక్ గారి నివాసంలో తల్లితండ్రులు శ్రీమతి జ్యోతిబాయ్ %డ% శ్రీరామ్ నాయక్ గారికి చెక్‌ను అందజేశారు. వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రీసత్య సాయి జిల్లా అధ్యక్షురాలు, పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీమతి ఉషశ్రీచరణ్ అందజేశారు మరియు పెనుకొండ నియోజకవర్గం ప్రజా ప్రతినిధులు, వైసీపీ నాయకులు, చేతుల మీదుగా చెక్ పంపిణీ చేశారు..

## అనంత నగరంలో మంత్రి నారా లోకేష్ కు జన నీరాజనం






- **ఎమ్మెల్యే దగ్గుపాటి ఆధ్వర్యంలో కనివినీ ఎరుగని రీతిలో స్వాగతం**
- **తపోవనం సర్కిల్లో భారీ గజ మాలలు వేసి అభిమానం చాటుకున్న దగ్గుపాటి**

**అంకుశం న్యూస్ అనంతపురం మే 16:** ఐటీ, విద్యా, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి అనంతపురం నగరానికి వచ్చిన నారా లోకేష్ ఘన స్వాగతం లభించింది. అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో కనివినీ ఎరుగని రీతిలో మంత్రి లోకేష్ కు ఘన స్వాగతం పలికారు. గుత్తి పర్యటన ముగించుకుని నగరానికి చేరుకున్న లోకేష్ కు తపోవనం సర్కిల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి రెండు భారీ గజమాలలు వేసి అభిమానం చాటుకున్నారు. ఎమ్మెల్యే వెంట వేలాది మంది కార్యకర్తలు, నాయకులు తరలివచ్చి లోకేష్ కు స్వాగతం పలికారు. ప్రతి ఒక్కర్నీ ఆప్యాయంగా పలుకరిస్తూ మంత్రి లోకేష్ ముందుకు సాగారు. తపోవనం సర్కిల్ జన సంద్రాన్ని తలపించింది. అనంతరం శ్రీనగర్ కాలనీలోని జీఎంఆర్ కాంపౌండ్ లో జరిగిన కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కుమార్తె వివాహ వేడుకకు హాజరయ్యారు. నూతన వధూవరులు శ్రీ చరిత, రాహుల్ ఆదిత్యలను ఆశీర్వదించారు. ఆ తర్వాత ఇటీవల మరణించిన అనంతపురం టీడీపీ మైనార్టీ నాయకులు, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేఎమ్ జకీవుల్లా కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. అనంతపురంలోని వారి నివాసానికి వెళ్లిన మంత్రి ముందుగా జకీవుల్లా చిత్రపటం వద్ద పూలు ఉంచి నివాళులు అర్పించారు. జాకీవుల్లా తండ్రి మాజీ ఎంపీ కేఎమ్ సైఫుల్లా ఇతర కుటుంబసభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని కుటుంబసభ్యులను ఓదార్చారు. జకీవుల్లా పార్టీకి చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. సైఫుల్లా గారి కుటుంబానికి పార్టీకి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అక్కడి నుంచి మంత్రి నారా లోకేష్ తిరుగుపయనమయ్యారు. అనంతపురం నగరంలో మంత్రి నారా లోకేష్ పాల్గొన్న అన్ని కార్యక్రమాల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగరంలో అభివృద్ధి, రాజకీయ అంశాల గురించి మంత్రి లోకేష్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తో చర్చించారు.

## తిరుమల వెంకన్నకు బంగారు కఠి, వరద హస్తాలు విరాళం





**అంకుశం న్యూస్ తిరుమల మే 16:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారికి శుక్రవారం ఉదయం భారీ బంగారు కానుక విరాళంగా అందింది. కలకత్తాకు చెందిన శ్రీ సంజీవ్ గోయెంకా రూ.3.63కోట్లు విలువైన 5.267 కేజీల బంగారంతో వజ్రాలు, రత్నాలతో పొదిగిన కఠి, వరద హస్తాలను చేయించి స్వామివారికి సమర్పించారు. ఈ మేరకు తిరుమలలోని రంగనాయకుల మండపంలో టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి ఆభరణాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, బొక్కసం ఇన్ ఛార్జి గురురాజ స్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మంత్రి జనార్ధన్‌రెడ్డి ఇంటికి స్పీకర్ అయ్యన్న

**(అంకుశం, బనగానపల్లి, మే 16):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు శుక్రవారం నంద్యాల జిల్లా బనగానపల్లెలోని మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. స్పీకర్ వెంట వచ్చిన మరో మంత్రి ఎన్ఎండి ఫరూక్‌కు మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ దంపతులు సాదర స్వాగతం పలికి, సత్కరించి, శ్రీ వెంకటేశ్వరస్వామి ప్రతిమను అందజేశారు.



## నెల లోపు సదరం సర్టిఫికెట్ల జారీ

మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి



**(అంకుశం, అమరావతి, మే 16):** స్లాట్ బుకింగ్ రోజు నుంచి నెల రోజుల లోపు సదరం సర్టిఫికెట్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజ నేయ స్వామి అధికారులకు సూచించారు. సచివాలయంలో దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమంపై అధికారులతో మంత్రి డోలా వీరాంజనేయులు శుక్రవారం సమీక్షించారు. గ్రామ సచివాలయాలు, మీసేవ కేంద్రాలతో పాటు మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సదరం స్లాట్ బుకింగ్ చేసుకునేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. స్లాట్ బుకింగ్ రోజు నుంచి నెల రోజుల లోపు సదరం సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. దివ్యాంగులకు ఇబ్బందులు లేకుండా సదరం క్యాంపులు నిర్వహించాలి. 70 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ పీఎంజేఏవై వందన స్కీమ్ ద్వారా రూ.5 లక్షల విలువ చేసేవైద్యం ఉచితంగా అందిస్తామని పేర్కొన్నారు.

## ఇల్లు కాలిపోయిన కుటుంబాన్ని పరామర్శించిన వైసిపి నేతలు

అగ్ని ప్రమాదం బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



**కాకినాడ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ మే 16:** పెదపూడి లో బుధవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదంలో ఇల్లు కాలిపోయిన బాధిత కుటుంబానికి సహాయంగా పెదపూడి గ్రామ వై ఎస్ ఆర్ సి పి సమకూర్చిన పదివేల రూపాయల నగదు, బియ్యం,దుస్తులను బాధితుడు కిలాడి లోవరాజు కుటుంబ సభ్యులకు అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి, పలువురు నాయకులు చేతుల మీదుగా శుక్రవారం అందచేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి స్థానికంగా అందుబాటులో లేనందున పార్టీ తరపున బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆదుకోవాలని ఆదేశించారని దీనిపై ఈరోజు ఇక్కడ కి వచ్చామని బాధితుడు లోవరాజు కుటుంబం నిరుపేద కుటుంబం అని, పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారని ఈ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి గృహ నిర్మాణ రుణం మంజూరు చేసిప్రభుత్వం తరపున ఆదుకోవడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో పెదపూడి మండల పార్టీ కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, నియోజకవర్గం వివర్స్ సెల్



అధ్యక్షులు పప్పు సింహాచలం, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు సాంబత్తుల చంటి, ఎంపీటీసీ సమ్మంగి దుర్గాప్రసాద్, పెద్దాడ సర్పంచ్ దోకుబుర్ర మీనాక్షీ కృష్ణ, వైఎస్సార్సీపి నాయకులు పంపన రమణ ,కాకర సాయిబాబా, నర్ల శ్రీను ,అందుగుల అబ్బు ,మారిన వెంకట్రావు ,కొంగర భద్రం, కిలాడి కుమార్, పప్పు జానకిరామ్, కాటయ్య, చుక్క దుర్గారావు, వందే సతీష్, మరాడి చిన్న సత్తిబాబు, పల్లంటి శివ ,చెల్లూరి శ్రీను, చుక్క దుర్గారావు, బోరాడ రాంబాబు తదితరులు పాల్గొన్నారు

## డెంగ్యూ వ్యాధిపై ప్రజలకు అవగాహన.. ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ మాధవి.



**అంకుశం న్యూస్ ధర్మవరం మే 16:** ప్రపంచ డెంగ్యూ దినోత్సవ సందర్భంగా ధర్మవరం పట్టణ ప్రజలకు ర్యాలీ రూపంలో అవగాహన ను ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ మాధవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ర్యాలీ నిర్వహణలో డెంగ్యూ వ్యాధి -దాని నివారణ పై పలు విషయాలను తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ డెంగీ జ్వరం అనేది ఎడిష్ ఈజీ ప్టై అను దోమ కుట్టడం వలన డెంగ్యూ, చికెన్ యూనియన్ వ్యాధులు వస్తాయని తెలిపారు. ఇటువంటి దోమలు ఇంటి పరిసరాలలోని చిన్నచిన్న నీటి నిల్వలలో అనగా తొట్టెలు, నీటి డ్ర మ్ములు, వర్షపు టైర్లు, వర్షం నీటి నిల్వ ఉన్న ప్లాస్టిక్ డబ్బాలు లలో ఉంటాయని తెలిపారు. ఆడ అనాఫిలస్ దోమలు రోజు మార్చి రోజు 150 గుడ్లను పెడతాయని అవి పగిలి చిన్నచిన్న గా నీటిలో కనిపించే లార్వాలుగా ఉంటాయని తెలిపారు. ప్రజలందరూ దోమల వ్యాప్తి అరికట్టడం అందరి బాధ్యత అని తెలిపారు. ఇంటి పరిసరాలు చెత్తాచెదారంతో ఉండరాదని, వర్షపు నీరు నిల్వ ఉండరాదని, మురికి నీటిలో వారానికి ఒకసారి కిరోసిన్ లేదా ఇంజన్ ఆయిల్ చెల్లాలని తెలిపారు. ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రై డే పాటించాలని, దోమల బెడద నుండి రక్షణ పొందుటకు దోమతెరలు వాడాలని తెలిపా రు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎమ్ అండ్ హెచ్ ఓ.. డాక్టర్ సెల్వియా సల్మాన్, డాక్టర్ చెన్నారెడ్డి, బీపీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ నాయక్, డాక్టర్ శ్రావణి, సబ్ యూనిట్ మలేరియా అధికారి జయరాం నాయక్ తో పాటు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ,సి ఓ డబ్లు వారు పాల్గొన్నారు.

## హంద్రీనీవా సుజల స్రవంతి'

# పూర్తికి సీఎం చంద్రబాబు ప్రత్యేక చర్యలు





- ఫేజ్ - 1, 2 కింద 554 కి.మీ మేర కాలువ పనులకు రూ.3,873 కోట్లు కేటాయింపు
- కాలువ వెడల్పుతో 3,850 క్యూసెక్కులకు పెరగనున్న నీటి సామర్థ్యం
- 5 నెలల కాలంలో లక్ష్యం మేర పనులు.
- .వచ్చే నెలకల్లా మొదటి దశ పనులు పూర్తి చేయాలని లక్ష్యం
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రివర్యులు నిర్మ లా రామానాయుడు

**అంకుశం న్యూస్ పుట్టపర్తి మే,16:** రాయలసీమ జీవనాడి హంద్రీనీవా సుజల స్రవంతి నిర్మాణం పనులు వేగవంతం చేసి... త్వరితగతిన ప్రాజెక్టును పూర్తి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పట్టుదలగా ఉన్నారు అని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రివర్యులు నిర్మలా రామానాయుడు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లాలో పర్యటనలో భాగంగా ధర్మవరం నియోజకవర్గ పరిధిలోని మలక వేమల హంద్రీనీవా ప్రధాన కాలువ పనులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం సమీక్ష సమావేశంలో మంత్రివర్యులు మాట్లాడుతూహంద్రీనీవా ప్రాజెక్టులో ఫేజ్ - 1, 2 కింద 554 కి.మీ. మేర కాలువ లైనింగ్, వెడల్పు పనులకు మొత్తం రూ.3,873 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ఫేజ్-1 కింద రూ.696 కోట్లతోనూ, ఫేజ్-2 కింద రూ.1,256 కోట్లతో %ఎచీూా% ప్రధాన కాలువ (%ఖఎ 216 - ఖఎ% 400), పుంగనూరు బ్రాంచ్ కాలువ (%ఖఎ 0.00 - ఖఎ% 75) పనులు చేపట్టారు. పుంగనూరు బ్రాంచ్ కాలువ (%ఖఎ 75 - ఖఎ% 207) పనులను రూ.480 కోట్లతో ఈ ఏడాది జనవరిలో ప్రారంభించారు.ప్రాజెక్టు పూర్తయితే %భాష్టుంవ-×% కింద కర్నూలు జిల్లాలో 77,094, నంద్యాల జిల్లాలో 2,906, అనంతపురం జిల్లాలో 1,18,000 ఎకరాలు... మొత్తం 1,98,000 ఎకరాలకు సాగునీరు అందుతుంది. %భాష్టుంవ-××% కింద అనంతపురం జిల్లాలో 33,617, సత్యసాయి జిల్లాలో 1,93,383, కడప జిల్లాలో 37,500, చిత్తూరు జిల్లాలో 1,40,000 ఎకరాలు కలిపి మొత్తం 4,04,500 ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఉమ్మడి కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాల్లో 6,02,500 ఎకరాలకు సాగునీరు లభిస్తుంది. మొత్తం 81 మండలాల్లో 33 లక్షల మందికి త్రాగు నీటి సరఫరాకు అవకాశం లభిస్తుంది. పేర్కొన్నారు.హంద్రీనీవా పనుల్లో నాణ్యత విషయం లో రాజీపడకూడదు. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహేష్ ఇంజనీర్లు సీఈ నాగరాజు, ఈ స్వరూప్ కుమార్, మురళి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు ఇతర ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# అనంతలో తిరంగా యాత్ర రేపు

- ఆపరేషన్ సింధూర్ విజయోత్సవం సందర్భంగా త్రివిధ దళాల సైనికులకు సంఘీభావంగా..
- అందరూ జాతీయ జెండా చేత పట్టుకుని పాల్గొందాం.. విజయవంతం చేద్దాం ...
- మన సైనికులకు సంఘీభావం తెలుపుదాంలి
- : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,
- : శనివారం ఉదయం 8:00 గంటల నుండి 9:00 గంటల వరకు తిరంగా యాత్ర..
- : అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్స్ నుండి సప్తగిరి సర్కిల్ వద్ద ఉన్న జాతీయ జెండా స్తంభం వరకు తిరంగా యాత్ర

**అంకుశం న్యూస్ అనంతపురము, మే 16:**
- ఆపరేషన్ సింధూర్ విజయోత్సవం సందర్భంగా త్రివిధ దళాల సైనికులకు సంఘీభావంగా తిరంగా యాత్ర నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ తెలిపారు.పెహల్గామ్ ఉగ్రదాడికి వ్యతిరేకంగా, ఉగ్రవాదులను అణచడానికి మన భారత ప్రభుత్వం ఆదేశాల మేరకు భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం అయిన సందర్భంగా, దేశరక్షణ, సరిహద్దుల రక్షణలో అహర్నిశలు నిమగ్నమైన మన సైనికులకు సంఘీభావం తెలపడం కోసం మన అనంతపురములో అందరి సహకారంతో ఈ తిరంగా యాత్ర నునిర్వహిస్తున్నాము.17-05-2025, శనివారం ఉదయం 8:00 గంటల నుండి 9:00 గంటల వరకు ..మన అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న గ్రౌండ్స్ నుండి సప్తగిరి సర్కిల్ వద్ద ఉన్న జాతీయ జెండా స్తంభం వరకు తిరంగా యాత్ర నిర్వహిస్తున్నాము. ప్రజా ప్రతినిధులు, మాజీ సైనికులు, అన్ని వర్గాల నగర ప్రజలు, మహిళలు, యువత, విద్యార్థులు , ఎన్జీఓలు, సామాజిక సంస్థలు, విద్యావేత్తలు, డాక్టర్లు, లాయర్లు, ప్రొఫెషనల్స్, వ్యాపార సంస్థలు, మీడియా, అధికారులు, ఉద్యోగులు, టీచర్లు, పోలీసులు, ఎన్ సీ సీ , ఎన్ ఎస్ ఎస్ క్యాడెట్స్ మరియు అన్ని వర్గాల ప్రజలు తిరంగా యాత్రలో పాల్గొని, విజయవంతం చేయాలని, మన సైనికులకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేస్తున్నాం. అని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ అన్నారు. జాతీయ సమైక్యత మరియు గౌరవం :ఆపరేషన్ సింధూర్ విజయవంతం సందర్భంగా ఆసేతు హిమాచలం ఉప్పొంగేలా..మన జాతీయ జెండా గౌరవాన్ని మరింత ఇనుమడింపు చేసేలా, మన దేశ సమైక్యత, సౌభ్రాతృత్వం ప్రతిబింబించేలా నిర్వహిస్తున్న ఈ తిరంగా యాత్ర ర్యాలీ ప్రజలలో దేశభక్తిని పెంపొందించడమే కాకుండా మన త్రివిధ దళాల సైనికుల పట్ల మన రుణం తీర్చుకునేలా నిలుస్తుందన్నారు.ప్రత్యేక ఏర్పాట్లు :లిప్రజల సౌకర్యార్థం ఎటువంటి ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ మరియు భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగింది. అలాగే తిరంగా యాత్ర ర్యాలీ రూట్ పొడవునా త్రాగు నీరు, మెడికల్ టీమ్ సదుపాయాలను ఏర్పాటు చేయడం జరిగింది. మీడియాకు ఇబ్బంది లేకుండా విజువల్ మీడియా కవరేజీకి వీలుగా ర్యాలీ ముందు ఒక వాహనాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నాము. అదనంగా ర్యాలీ, మీడియా వాహనం ముందు డీజే సౌండ్ తో కూడిన ఒక వాహనాన్ని



కూడా ఏర్పాటు చేసి దేశభక్తి గీతాలను ప్లే చేయడం కోసం ఏర్పాటు చేస్తున్నాము.తిరంగా యాత్ర ర్యాలీ ముగింపు పాయింట్ లో మునిసిపల్ ఆఫీసు ఎదురుగా ఉన్న పెద్ద జాతీయ జెండా స్తంభం వద్ద అందరం జాతీయ గీతాలాపనతో తిరంగా యాత్ర ర్యాలీ ముగుస్తుంది. తిరంగా యాత్ర ర్యాలీలో అందరూ స్వచ్ఛందంగా పాల్గొందాం - మన సాయుధ దళాల సైనికులకు సంఘీభావం తెలుపుదాం.. మన ఉమ్మడి జిల్లా మురళి నాయక్ లాంటి అమర జవాన్లకు అశ్రు నివాళులు అర్పిద్దామన్నారు.

# కంటి క్యాన్సర్ వ్యాధి ప్రాథమిక దశలోనే గుర్తించాలి..

విశ్రాంత జిల్లా ఆంధత్వ నివారణ అధికారి సంకారపు నర్సింహులు.

**అంకుశం న్యూస్ ధర్మవరం మే 16:** కంటి క్యాన్సర్ వ్యాధి ను ప్రాథమిక దశలోనే గుర్తించాలని రిటైర్డ్ జిల్లా అందత్వ నివారణ అధికారి కంటి వైద్య నిపుణులు డాక్టర్ సంకారపు నరసింహులు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎస్బిఐ కాలనీలో గల మధు కంటి వైద్యశాలలో పట్టణంలోని పలు డాక్టర్లకు ప్రపంచ కంటి క్యాన్సర్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్లతో పాటు వారు కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం డాక్టర్ నరసింహులు మాట్లాడుతూ కంటికి క్యాన్సర్ గురించి కొన్ని ముఖ్యమైన విషయాలను వారు తెలియజేశారు. చిన్నపిల్లలకు వచ్చే ముఖ్యమైనది కంటి క్యాన్సర్ అని, సాధారణంగా పుట్టిన బిడ్డ నుండి రెండు సంవత్సరాల వయసు లోపల వారికి, లేదా ఐదేళ్ల వరకు కళ్ళకు వస్తుందని తెలిపారు. అదేవిధంగా తల్లిదండ్రుల నుండి వచ్చే జీన్స్ మార్పుల వలన కూడా క్యాన్సర్ వ్యాధి వస్తుందని తెలిపారు. రెటీనాలో ప్రారంభమై కంటిలోని అన్ని భాగాలకు ఈ వ్యాధి వ్యాపిస్తుందని, తదుపరి కంటి నరము ద్వారా మెదడుకు చేరుతుందని, అప్పుడే అది ప్రాణాంతకం అవుతుందని తెలిపారు. కంటి యొక్క నల్ల గుడ్డులోని కంటిపాపలలో తెల్లటి చుక్కగా కనిపిస్తుందని తర్వాత కంటిలోని మిగతా భాగాలకు వ్యాపిస్తుందని తెలిపారు. ఈ క్యాన్సర్ వ్యాధిని ప్రథమంగా తల్లి గుర్తించే వీలు ఉంటుందని తెలిపారు. గుర్తించిన వెంటనే కంటి డాక్టర్లకు సంప్రదించాలని తెలిపారు. అధునాతనంగా సిటీ స్కానింగ్, ఎమ్మారై స్కానింగ్ ల ద్వారా ఈ వ్యాధి వ్యాపించిన భాగాలను సులభంగా గుర్తించవచ్చునని తెలిపారు. ఈ క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించకపోతే కంటిచూపు పోయే అవకాశం ఉందని తెలిపారు. కంటి క్యాన్సర్ ను మందుల ద్వారా, లేజర్ చికిత్స ద్వారా, రేడియేషన్ చికిత్స ద్వారా చేయవచ్చునని తెలిపారు. అందుకే పెద్దలు అన్నారు "సర్వేంద్రియానం నయనం ప్రధానం" అని తెలిపారు. భయంకరమైన ఈ కంటి క్యాన్సర్ స్వాభావికంగా దానికదే కరిగిపోయే అవకాశం కలదని, కానీ ఆ అవకాశం కోసం ఎదురుచూడడం మాత్రం ఏమాత్రం సమంజసం కాదని వారు స్పష్టం చేశారు.




## ధర్మవరం శ్రీ లక్ష్మి చెన్న కేశవ స్వామి వారి బ్రహ్మోత్సవాలు విజయవంతం!

మంత్రి సత్య కుమార్ కు కృతజ్ఞతలు....


ఆలయం ఆడ్ హాక్ కమిటీ చైర్మన్ చెన్నం శెట్టి జగదీష్ ప్రసాద్...

**అంకుశం న్యూస్ ధర్మవరం మే 16:** ధర్మవరం లో 4 నుండి 14 వరకూ జరిగిన ధర్మవరం శ్రీ లక్ష్మి చెన్న కేశవ స్వామి వారి బ్రహ్మోత్సవాలు విజయవంతం అయ్యాయని, ఈ వేడుకలులో పాల్గొన్న రాష్ట్ర వైద్య ఆరోగ్య, శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ కు ఆలయం కమిటీ ఆడ్ హాక్ కమిటీ చైర్మన్ చెన్నంశెట్టి జగదీష్ ప్రసాద్ మరియూ ఆలయం ఇ ఓ బి ఆర్ వెంకటేశులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేడుకలు విజయవంతం చేసిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేసారు.



## అనంతపురం ప్రాంతానికి మరిన్ని రైలు సర్వీసులు అందుబాటులోకి తీసుకురావాలి


- : కేంద్ర రైల్వే సహాయ మంత్రి వి.సోమన్నని కోరిన అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబిక లక్ష్మీనారాయణ



**అంకుశం న్యూస్అనంతపురం: మే 16:** కేంద్ర రైల్వే సహాయ మంత్రి వి.సోమన్న, అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబిక లక్ష్మీనారాయణ శుక్రవారం అనంతపురం రైల్వే స్టేషన్‌ను సందర్శించి అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రైల్వే మౌలిక సదుపాయాల మెరుగుదల, ప్రయాణికుల సౌకర్యాల అభివృద్ధి వంటి అంశాలపై మంత్రి గారితో వివరంగా చర్చించారు. అనంతపురం ప్రాంతానికి మరిన్ని రైలు సర్వీసులు అందుబాటులోకి రావడం, రైల్వే మౌలిక సదుపాయాల ఆధునీకీకరణ వంటి అంశాల్లో కార్యాచరణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రైల్వే అభివృద్ధిపై జరిగిన లోతైన చర్చలో, అనంతపురం %-% బెంగళూరు రైల్వే సర్వీసుకు భారత రైల్వే శాఖ ఆమోదం లభించడంలో ముఖ్యపాత్ర పోషించిన కేంద్ర రైల్వే సహాయ మంత్రి వి.సోమన్న గారికి అనంతపురం ప్రజల తరఫున ఎంపీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అదే విధంగా, ఢిల్లీకి వెళ్లే రాజధాని ఎక్స్‌ప్రెస్‌కు అనంతపురంలో హాల్ట్ కల్పించాలని, అలాగే ధర్మవరం - మచిలీపట్నం రైలుకు రాయచెరువు స్టేషన్లో నిలుపుదల కల్పించాలని మంత్రిని ఎంపీ కోరారు. కేంద్ర మంత్రి దీనిపై సానుకూలంగా స్పందించి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుంతకల్ డిఆర్ఎం, రైల్వే కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఒక వైపు చేనేత రంగం ప్రగతి మరో వైపు ఉచిత వైద్య సేవలు...

- డి. వి. వెంకటేష్ (చిట్టీ )



**అంకుశం న్యూస్ ధర్మవరం మే 16:** ధర్మవరం పట్టు చీరలకు ప్రసిద్ధి ఒకవైపు ధర్మవరం చేనేత రంగంలో బిజీగా వుంటూ మరోవైపు సేవా భావం లో రికార్డులు సృష్టించిన ధర్మవరం పట్టణానికి చెందిన డి. వి. వెంకటేష్ ఒకరు ఆయన ధర్మవరం శ్రీ శాంతకళ చౌడేశ్వరి దేవి దేవాలయం తరుపున ప్రతి నెల మొదటి వారం ఈ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా ద్వారా ఇప్పటికి 110 వైద్య శిబిరాలు నిర్వహించి, సేవలు అందిస్తున్నారు. 33 వేల మందికి ఉచిత వైద్య చికిత్సలు చేశారు. వారికి నెలకు సరిపడా మందులు ఉచితంగా అందజేశారు.తమ కుమారుడు డా. డి. వి. జై దీపు నేత, వైద్య వృత్తి లో వున్నందుకు గాను ఈ సేవలు అందిస్తున్నామని, డి. వి. వెంకటేశు తెలిపారు.ఈ ఉచిత వైద్య శిబిరాలు ఇప్పటి వరకూ 110 వరకూ నిర్వహించడం జరిగింది.అంతే గాకుండా సామాజిక సేవా కార్యక్రమం కింద తమ తండ్రి దాసరి పెద్ద వెంకటేశు జ్ఞాపకార్థం ప్రతినెలా 150 మంది కి రూ 200 చొప్పున పెన్షన్ అందజేస్తున్నారు.ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ తో సంభందం లేకుండా అందరికీ ఉచితంగా పెన్షన్ అందజేయడం పట్ల డి. వి. వెంకటేష్ నేత ను పలువురు స్థానికులు అభినందిస్తున్నారు. తన తల్లి తండ్రులు శ్రీ మతి దాసరి కేశమ్మ, దాసరి పెద్ద వెంకటేశులు స్ఫూర్తి తో సేవా భావం ఉండాలి కాని ఎలాంటి హద్దులు లేవని నిరూపించారు. డి. వి. వెంకటేశు (చిట్టీ )ధర్మవరం లో ధర్మ%శీ% ఉందని మరోసారి నిరూపించారు వీరు వీరికి పలువురు నేతన్నలు అభినందనలు తెలిపారు.

## జకీవుల్లా కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి లోకేష్

కుటుంబానికి అండగా ఉంటానని భరోసా





**అంకుశం న్యూస్ అనంతపురం మే 16:** అనంతపురం జిల్లాలోఅనంతపురం నగరంలోఇటీవల మరణించిన అనంతపురం టీడీపీ మైనార్టీ నాయకులు, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేఎమ్ జకీవుల్లా కుటుంబ సభ్యులను విద్య,ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పరామర్శించారు. అనంతపురంలోని వారి నివాసంలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, కేంద్రమంత్రి మంత్రి రామ్మోహన్ నాయుడు, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ జకీవుల్లా చిత్రపటం వద్ద పూలు ఉంచి నివాళులు అర్పించారు. అనంతరం జకీవుల్లా తండ్రి గారైన మాజీ ఎంపీ కేఎమ్ సైఫుల్లా, జకీవుల్లా కుమారుడు కేఎమ్ అర్షదుల్లా, దివంగత జకీవుల్లా సోదరుడి కుమారుడు కేఎమ్ అర్ఫతుల్లాతో పాటు ఇతర కుటుంబసభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని కుటుంబసభ్యులను ఓదార్చారు. జకీవుల్లా పార్టీకి చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. సైఫుల్లా గారి కుటుంబానికి పార్టీకి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. జకీవుల్లా మృతిపట్ల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.